

సీసీఐలో పత్తి పరిమితి పెంపు

- ఏఈవోల ప్రత్యేక ధ్రువీకరణతోనే ఎకరాకు 12 క్వింటాళ్లు
- సమాచారం లేని రైతులు, మిల్లర్లు
- పత్తి రైతులకు ఊరట

6





మోగిన 'పంచాయతీ' నగారా

- జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు
- తొలి విడతలో 5, రెండో విడతలో 7, తుది విడతలో 6 మండలాల్లో నిర్వహణ
- ఎన్నికల వివరాలను ప్రకటించిన ఉన్నతాధికారులు
- జిల్లాలో 482 పంచాయతీలు.. 4,110 వార్డులు..
- ఓటుహక్కు వినియోగించు కోనున్న 5,56,780 మంది
- తక్షణమే అమలులోకి ఎన్నికల కోడ్

మండలాలు, గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్లు..				ఓటర్లు			
మండలం	జీపీ	పోలింగ్ స్టేషన్	వార్డులు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బయ్యారం	29	252	252	18887	19724	01	38612
చిన్నగూడూరు	11	96	96	6507	6590	-	13097
దంతాలపల్లి	18	166	166	13019	13663	01	26683
డోర్నకల్	26	218	218	14289	14799	03	29091
గంగారం	12	100	100	4543	4631	-	9174
గార్ల	20	184	184	15007	15699	01	30707
గూడూరు	41	354	354	23851	24717	02	48570
ఇనుగుర్తి	13	112	112	8968	9166	01	18135
కేసముద్రం	29	254	254	15980	16123	-	32103
కొత్తగూడ	24	202	202	11740	12326	02	24068
కురవి	41	344	344	21464	22752	-	44216
మహ-బాద్	41	338	338	19422	20244	06	39672
మరిపెడ	48	396	396	22986	23492	-	46478
నర్సింహులపేట	23	194	194	12118	12616	02	24736
నెల్లికుదురు	31	280	280	20019	20451	01	40471
పెద్దవంగర	26	192	192	12511	12898	-	25409
సీరోలు	18	152	152	9118	9350	01	18469
తొర్రూరు	31	276	276	23263	23823	03	47089
మొత్తం	482	4110	4110	2,73,692	2,83,064	24	5,56,780

మహబూబాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రేపు.. మాపు.. అంటూ వాయిదా పడుతూ వస్తున్న పంచాయతీ ఎన్నికల ముహూర్తం ఎట్టకేలకు ఖరారైంది. జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచే గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం సాయంత్రం ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో మహబూబాబాద్ జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికలకు ఇటు అధికార యంత్రాంగం.. అటు అన్ని రాజకీయ పార్టీలు సన్నద్ధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు 11, 14, 17 తేదీల్లో మూడు విడతలుగా నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికలకు అనుగుణంగా మహబూబాబాద్ జిల్లాలోనూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 18 మండలాల్లోని 482 గ్రామ పంచాయతీలు, 4,110 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి 4,110 పోలింగ్ స్టేషన్లు (మిగతా 8లో..)

వేంను కలిసిన డీసీసీ అధ్యక్షురాలు



హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు భూక్య ఉమ, ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమ, మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ దంపతులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల డీసీసీ అధ్యక్షురాలిగా నియామకమైన భూక్య ఉమ హైదరాబాద్‌లో సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేస్తానని, కార్యకర్తల సహకారంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయపథాన నిలుపుతామని స్పష్టం చేశారు.

అమృత్ పనుల్లో వేగం పెంచాలి

- ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్

8

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 306 ఎగ్జిబిట్ల ప్రదర్శన

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం జిల్లా సైన్స్ అధికారి అప్పారావు అధ్యక్షతన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు వైజ్ఞానిక ప్రదర్శనలపై ఆసక్తిని పెంపొందించేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని... లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి బాల శాస్త్రవేత్త అని, వారిలో ఉన్న ఆలోచనలను ఎగ్జిబిట్ల రూపంలో ప్రదర్శిస్తే నూతన ఆలోచనలు వస్తాయని పేర్కొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ (మిగతా 8లో..)



మహబూబాబాద్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించాలి

- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్
- కురవిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

కురవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఎటువంటి భారం వేయకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. కురవిలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ప్రజలకు ఉపయోగకరమైన ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుని రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 22 మంది ముఖ్యమంత్రులు రూ.వెయ్యి కోట్లు అప్పులు తేస్తే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్లలో రూ.10 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ప్రజలపై పెనుభారం మోపారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో నాణ్యమైన చీరలను అందిస్తున్నామన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మహిళలకు రూ.12.80 కోట్ల వడ్డీలేని రుణాలు అందించినట్లు వెల్లడించారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విప్ జాటోత్ రాంచందర్‌నాయక్

మద్దతు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు..

రైతులు దళారుల చేతిలో మోసపోకుండా మద్దతు ధర అందించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను (మిగతా 8లో..)

విద్యార్థినులను పట్టించుకోని అధికారులు

- తాను వస్తున్నానని తెలిసి మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు..
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అసహనం



విద్యార్థినులతో మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్‌నాయక్ 8

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

మరిపెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అలజడులు సృష్టించే వారిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ హెచ్చరించారు. మంగళవారం మరిపెడ పీఎస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాకప్ రూం, స్టోర్ రూం, రిసెప్షన్ కౌంటర్, రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. క్రైం రేట్స్‌పై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలపై కఠినంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజ్ కుమార్‌గౌడ్, ఎస్సై ఇ.వీరభద్రరావు, అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మరిపెడ పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ శబరీష్

మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- బయ్యారం పెద్ద చెరువులో చేపపిల్లలు విడుదల



చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మంగళవారం బయ్యారం పెద్ద చెరువులో 5.8 లక్షల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల వృత్తికి అవసరమైన సామగ్రిని సబ్సిడీపై అందించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతేగాక మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా పలు పథకాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి శివప్రసాద్, ఎంపీడీవో దీపిక, ఎస్సై తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ రాంబాబు, వెంకటేశ్వర్లు, ఫిషరీస్ ఫీల్డ్‌మెన్స్ శివకుమార్, రాజు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీను, కాంగ్రెస్ నాయకులు శ్రీను, వెంకటపతి, ఉపేందర్, నాగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రచారం కాదు.. పనులకే ప్రాధాన్యత..

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- పెద్దవంగరలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

పెద్దవంగర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు ప్రచారాలకే పరిమితమైతే.. ప్రజా పాలనలో తాము అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దవంగర మండల కేంద్రంలో రూ.1.30 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పాటుపడుతున్నట్లు చెప్పారు. నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు తరువాత పెద్దవంగర, అమర్‌సింగ్‌తండా, గంట్లకుంట, కొరిపెల్లి, ఉప్పెరగూడెం గ్రామాలకు వ్యవసాయ, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందనుందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే చెన్నూర్ రిజర్వాయర్ పనులు పూర్తిచేసి సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, ఇన్‌చార్జి విజయ్‌పాల్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు హమ్యానాయక్, నెహ్రూనాయక్, ప్రవీణ్‌రావు, మురళి, శ్యాం, మల్లికార్జునచారి, విద్యుత్ ఎస్ఈ విజయేందర్ రెడ్డి, అధికారులు రవి, చలపతిరావు, రమేష్‌బాబు, రమణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



మురుమూరులో ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపు వద్ద సీఆర్పీఎఫ్ జవాన్‌లతో ఐజీ విక్రమ్, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం..

- సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
- మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంపు ప్రారంభం
- కర్రెగుట్టలపై రహదారి నిర్మాణం చేపడతామని స్పష్టం

7

సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే..



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే అనుకూలంగా ఉన్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రేవంత్ రెడ్డి అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలోని రైతులకు యూరియా కొరత ఏర్పడిందని, దాంతో రైతులు అరిగోస పడ్డారని అన్నారు. బోగస్ హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. రామచంద్రయ్య శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఇంచార్జీ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్, పాలకుర్తి యాదగిరి రావు, సమ్మయ్య, సుధాకర్, రఘు,విజయ శ్రీనివాస్, వెంకన్న, రాజేందర్, షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు రికార్డులను భద్రపర్చుకోవాలి

దంతాలపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు జీపీ రికార్డులను అప్రమత్తంగా వ్యవహరిస్తూ భద్రపర్చుకోవాలని ఎంపీడీవో విజయ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని బీరిశెట్టిగూడెం పంచాయతీ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జీపీ పన్నుల వసూళ్లు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. గ్రామంలో నిర్వహిస్తోన్న వారంతపు సంతలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె జీపీ సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలో ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు రిజర్వేషన్లు ..

దంతాలపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 జీపీలకు సర్పంచ్, వార్డులకు మంగళవారం అధికారికంగా రిజర్వేషన్ వివరాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని ఆగపేట (బీసీ జనరల్), బీరిశెట్టిగూడెం (జనరల్ మహిళ), బొడ్లాడ (జనరల్), దంతాలపల్లి (జనరల్), దాట్ల (జనరల్ మహిళ), దొనకొండ (జనరల్ మహిళ), దుబ్బతండ (ఎస్టీ జనరల్), గున్నేపల్లి (జనరల్ మహిళ), కుమ్మరికుంట్ల (బీసీ మహిళ) లక్ష్మీపురం (జనరల్), నిదానపురం (బీసీ మహిళ), పెద్దముప్పారం (బీసీ జనరల్), రామానుజపురం (జనరల్), రామవరం (ఎస్సీ మహిళ) రేపోణి (ఎస్సీ జనరల్), తూర్పుతండ (ఎస్టీ జనరల్) వాల్యతండ (ఎస్టీ మహిళ) వేములపల్లి (ఎస్సీ జనరల్) కేటాయించారని ఎంపీడీవో విజయ పేర్కొన్నారు. కాగా మండలంలోని 18 జీపీలోని 166 వార్డులకు గాను నోటీసు బోర్డులో రిజర్వేషన్ వివరాలను పొందుపర్చామన్నారు.నేరుగా గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి వివరాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మమ్మద్ అఫ్సరపాషా, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, సిబ్బంది భద్రకాళి తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలి

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. మంగళవారం తొర్రూరులోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ జిల్లా కేంద్రంలో జరిగే నిరసనకు రైతులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరన్న, సాయిలు, మహేందర్, లక్ష్మణ్, వెంకటయ్య, యాకయ్య తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని ధర్నా

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలివ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ఆధ్వర్యంలో కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంచ రమేష్, బట్టమేకల రాజు, దుబ్బాకుల యాదగిరి, బానోత్ బిక్యానాయక్, బట్టు మురళి, సకినాల నరేష్, బానోత్ శ్రీను పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



చేప పిల్లలను చెరువులో వేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు మండలం అమ్మా పురంలో ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై అందజేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కుటుంబాల్లో ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా గ్రామాల్లో స్వయం ఉపాధి అవకాశాలు పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేత మవుతుందన్నారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడు తుందని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతా నికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, బ్లాక్ అధ్యక్షుడు హమ్యానాయక్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, ఏఎంసీ డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని సోమేశ్వరరావు, ముద్దం విక్రమ్‌రెడ్డి, జగన్, మహబూబ్‌రెడ్డి, మాచర్ల అరవింద్, ముదిరాజ్ జిల్లా డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

దంతాలపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతు చట్టాల పై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేపట్టిన నిరసనలో భాగంగా రైతులపై పెట్టిన కేసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తహసీల్దార్ సునిల్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆపార్టీ డివిజన్ కార్యదర్శి ఊడ్గుల లింగన్న మాట్లాడుతూ దేశ రాజదానిలో రైతులు 13 నెలలుగా నిరసన చేసి సాధించుకున్న చట్టాల రద్దుపై విజయం సాధించారన్నారు. ఈనేపథ్యంలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగంపై చిన్న చూపు చూస్తుందన్నారు. దేశం రైతాంగంపైనే ఆధారపడిన విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్కేఎం డివిజన్ నాయకులు చిర్ర యాకయ్య, వీరబద్రము, బిక్షపతి, షాజహాన్, పాషా, తండ సురేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని జిల్లా అధ్యక్షుడు జంజిరాల నాగరాజు తెలిపారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో 6మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశామని, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని తెలిపారు. తొర్రూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మెరుగు రమేశ్, ఎ.అరుణ్ కుమార్, పెద్దవంగర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.సురేష్, కె.మధుసూదన్ రెడ్డి, దంతాలపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.శ్రీనివాస్ రెడ్డి, ఎ.మహేందర్, మరిపెడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.శ్యామ్‌కుమార్, ఎస్.రాజేంద్ర, నెల్లికుదురు మండలం కె.సుధాకర్, సీహెచ్. కళ్యాణ్, నర్సింహులపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.వీరేష్, టి.రాజులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపికృష్ణ, హరిబాబు, లింగం తదితరులు ఉన్నారు.

విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న డీటీడబ్ల్యూవో దేశిరాంనాయక్

దంతాలపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహంలో ఉంటున్న గ్రామీణ పేద విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దేశిరాంనాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన దంతాలపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని స్టాక్‌రూం, క్లాస్‌రూంలను అకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు ఆరుబయట పోకుండా వార్డెన్ చర్యలు తీసుకోవాలన్నారు. చలికాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసే నిత్యవసర సరుకులు, విద్యార్థులకు నిత్యం మెను ప్రకారం ఇస్తున్న చార్టును పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వేడివేడి ఆహారం అందించాలన్నారు. తాగునీటి విషయంలో కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగానే వార్డెను ఉండి విద్యార్థుల బాగోగులను చూసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు, స్థానిక వార్డెన్ నాగరాజు, వర్కర్లు చక్రూనాయక్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

పెద్దవంగర, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : చిన్న గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె ధగ్ధమైన సంఘటన మండలంలోని అవుతాపురంలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల కనుకయ్య కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం ఇంట్లో నివసిస్తున్న సమయంలో గ్యాస్ లీకై ఘాటైన వాసన రావడంతో వెంటనే మేల్కొని ఇంటి నుంచి బయటికి వచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికి పెద్ద శబ్దంతో మంటలు వ్యాపించి పూర్తిగా గుడిసె పూర్తిగా దగ్ధమైంది. వంట సామగ్రి తదితర వస్తువులు దగ్ధంకావడంతో సుమారు రూ.50వేల ఆస్తి నష్టం జరిగింది. బాధితుడిని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోటకేరి శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించి నిత్యవసర వస్తువులను ఆర్థికసాయాన్ని అందించి దాతృత్వం చాటుకున్నారు.

సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయాలి

- 42శాతం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలి

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ బహుజన నాయకులందరు ర్యాలీగా ఏర్పడి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీల అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి రాబోయే పార్లమెంట్ సీతాకాల సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చంద మల్లయ్య, కుమారస్వామి, మధు, వెంకన్న, రమేష్, సోమయ్య, సుధాకర్, ఫులేందర్, అల్లబాబు, మధూకర్, శంకర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు అందేలా చూడాలి

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపకార వేతనాలు అందేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు చొరవ చూపాలని మండల ప్రత్యేకాధికారి వ్యవసాయశాఖ ఏడీఏ విజయచంద్ర అన్నారు. మంగళవారం తొర్రూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులతో అవగాహన నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందుతున్నాయని, ఆయా పాఠశాలల హెచ్ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రాజేశ్వరి, డీటీ నర్సయ్య, ఆయా హాస్టళ్ల వార్డెన్‌లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సీతారాంపూర్ స్కూల్‌కు బెంచీల బహూకరణ

మరిపెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీతారాంపూర్ పీఎస్ పాఠశాలకు ఆర్.అచ్యుత్‌రావు రూ.90వేల విలువ చేసే బెంచీలను ఆయన మంగళవారం బహూకరించారు. విద్యార్థులు కింద కూర్చొని విద్యార్జన చేస్తున్న విషయం తెలుసుకొని దాతృత్వాన్ని చాటిన అచ్యుత్‌రావు గొప్పతనాన్ని ఎంఈవో అనితాదేవి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ హెచం అర్జున్, టీచర్లు మహేశ్‌గౌడ్, మంగీలాల్, సందీప్, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నాయకులు

తొర్రూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆయన స్వగృహంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోనిఅన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు మేకల కుమార్, వెంకట్ రెడ్డి, ముద్దం విక్రమ్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, రాములు, హరీష్ తదితరులు ఉన్నారు.

పత్తి విక్రయ పరిమితి పెంపు

- ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్లకు పెంచిన సీసీఐ
- పత్తి రైతులకు ఊరట - అందరికీ అందని సమాచారం



కేసముద్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లలో ప్రధాన అవరోధంగా నిలిచిన పరిమితి నిబంధన తొలగిపోయింది. ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తినే విక్రయించే అవకాశం ఉండగా, తాజాగా 11.5 నుంచి 12 క్వింటాళ్ల వరకు అమ్ముకునే వెసులుబాటును రైతులకు కల్పించారు. ఈ మేరకు రెండో రోజుల క్రితం వ్యవసాయాధికారులకు ఈ మేరకు సీసీఐ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లాలో 85,480 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఆరు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ జిన్నింగ్ మిల్లుల సామర్థ్యం 6 లక్షల క్వింటాళ్లు కాగా ఈసారి ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇందులో దాదాపు సగం సరుకే అంటే 3 లక్షల క్వింటాళ్ల వరకే సీసీఐ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈసారి సీసీఐకి పత్తి విక్రయించే రైతులు తమ స్మార్ట్ ఫోన్లలో 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని సరుకును మిల్లుకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇందులో ఎకరాకు తొలుత 12 క్వింటాళ్లు విక్రయించేందుకు అవకాశం ఇవ్వగా, ఈనెల 2 నుంచి ఏడు క్వింటాళ్లకే పరిమితి విధించారు. సాధారణంగా పత్తి ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్లు వస్తుందని, ఈసారి వర్షాలతో దెబ్బతినడంతో సగటు దిగుబడి 12 క్వింటాళ్లుగా అధికారులు లెక్కించారు. అయినప్పటికీ సీసీఐలో ఏడు క్వింటాళ్లకే అవకాశం ఉండడంతో రైతులు మిగిలిన సరుకు నాణ్యత ఉన్నప్పటికీ ప్రైవేటుకు తక్కువ ధరలకు విక్రయించుకున్నారు. ఈ పరిమితిని 12 క్వింటాళ్లకు చేయాలని అటు రైతులు, ఇటు మిల్లర్లు కొద్దిరోజులుగా సీసీఐని కోరుతున్నారు.

ఏఈవో ధ్రువీకరణతో పరిమితి పెంపు..

కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరానికి ఏడు క్వింటాళ్లనే విక్రయించే అవకాశం ఉండగా దీన్ని 12 క్వింటాళ్ల వరకు పెంచుకునే అవకాశాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) ధ్రువీకరణ ద్వారా ఇచ్చారు. అయితే ఏఈవో ప్రత్యక్షంగా రైతు పండించిన పంటను చూసి వారికి ఇచ్చిన లాగ్‌ఇన్‌లో రైతు వివరాలతో దిగుబడిని నమోదు చేయడం ద్వారా విక్రయించే అవకాశాన్ని కల్పించారు. ఏఈవో లాగ్‌ఇన్‌లో రైతు వివరాలు, దిగుబడిని నమోదు చేసి ఆయన మొబైల్ ఓటీపీ ద్వారా 'ఈల్డింగ్ సర్టిఫికెట్' తయారై ఆన్‌లైన్‌లోనే సీసీఐ కేంద్రానికి వెళుతుంది. రైతు సీసీఐ కేంద్రానికి వెళ్లగానే సదరు పరిమితితో పత్తిని విక్రయించేందుకు వీలుంటుంది. ఈ విషయంలో అవకతవకలకు తావులేకుండా పూర్తిగా ఏఈవోల ధ్రువీకరణతోనే ఈ ప్రక్రియ నిర్వహించేలా నిబంధనలను రూపొందించారు. అయితే పరిమితి పెంచుకునే అవకాశాన్ని కల్పించి రెండు రోజులవుతున్నప్పటికీ ఈ విషయంపై రైతులకు, మిల్లర్లకు సమాచారం లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి బి.వెంకన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సీసీఐకి విక్రయించే రైతులకు పత్తి పరిమితిని పెంచే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఏదేమైనా సీసీఐలో పత్తి పరిమితిని ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్లకు పెంచడం రైతులకు కొంత ఊరట లభించినట్లయింది.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాలు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల ఎంపిక కోసం 6 జూన్, 2025న తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంపికలు జరిగి నెలలు గడుస్తున్నా దివ్యాంగులకు పరికరాలు అందలేదని వాపోయారు. కార్యక్రమంలో ఆర్.సారయ్య, ఎన్.మణెమ్మ, ఎస్.పద్మ, డి.ఉపేందర్, గీత పాల్గొన్నారు.


ఇచ్చిన హామీలను అమలు చేయాలి

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు కార్మిక చట్టాలను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరన్నకు వినతిపత్రం అందించారు. రైతు వ్యతిరేక చట్టాలను నిలిపివేస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లు దాటుతున్నా కేంద్ర ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకపోవడం సరికాదన్నారు. రైతుల మరణ శాసనమైన చట్టాలను చేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి కుట్రలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బ వెంకట్‌రెడ్డి, దాసరి మల్లేశం, జేవీఆర్, ఎండి.నవాబ్, మాచర్ల సైదులు, రాజేందర్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు సాయిరాం ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో ఈ నెల 26 నుంచి డిసెంబరు 2 వరకు జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు పదవ తరగతి విద్యార్థి సాయిరాం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గండి అశోక్‌కుమార్ తెలిపారు. మహబూబాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థి సాయిరామ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ... నల్గొండలో ఈ నెల 3 నుంచి 5 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి జర్పుల సాయిరాం అండర్-17, 41 కేజీల విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ విష్ణుగణేష్, కోచ్ రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని గిరిజన భవనంలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.2.70 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... మహిళల ఆర్థిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, ఆర్డీవో కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్‌కుమార్, డీఆర్డీఏ పీడీ మధుసూదనరాజు, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, కవిత పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి సర్కారు కృషి



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బీటీ పనులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ, డ్వాక్రా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, సొసైటీ చైర్మన్లు వడ్లమూడి దుర్గాప్రసాద్, పుచ్చకాయల వీరభద్రం, కట్టా శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి, కాశయ్య, నాయకులు గింజల నర్సిరెడ్డి, దనియాకుల రామారావు, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, షంషాద్ బేగం, భూక్యా నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, ఎం.వెంకయ్య, యాకుబ్ పాషా, బాబులాల్ నాయక్, రాజీవ్ నాయుడు, పల్లా నర్సయ్య, రాంసింగ్ నాయక్ పాల్గొన్నారు.

60 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



అయ్యగారిపల్లిలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి

ఇనుగుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యగారిపల్లిలో మంగళవారం 60మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భూక్య శోభన్‌బాబు రూ.4.80 లక్షలతో సమకూర్చిన సైకిళ్లను కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఇనుగుర్తితో పాటు కోమటిపల్లి, చిన్నముప్పారం గ్రామాల నుంచి మండల కేంద్రంలోని హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులకు ఆసరాగా నిలిచిన శోభన్‌బాబును మార్కెట్ చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ కరుణాకర్, ఎంఈవో రూపారాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, కొట్టం రాము, మామిడి శోభన్, అశోక్, మాలోత్ మంజుల, మామిడి జనార్దన్, మంగ్యానాయక్, బైరు అశోక్, చిన్నాల కట్టయ్య, మలిశెట్టి శోభన్ పాల్గొన్నారు.

» తేమ విషయంలో జాగ్రత్తలు పాటించాలి
» రైతులకు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం సూచన



మీ పత్తి బంగారం కావాలంటే..

వరంగల్ వ్యవసాయం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో అతివృష్టి, అనావృష్టి వల్ల ఈసారి పత్తి దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. వచ్చిన కాస్త పత్తిని నాణ్యతగా మార్కెట్‌కు తరలిస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా.. పెద్ద ఎత్తున నష్టపోవాల్సి వస్తుంది. అందుకే పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మంచి ధర రావాలంటే ఏం చేయాలి అనే అంశాలపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేశం కొన్ని సూచనలు చేస్తున్నారు. అవేంటో ఆయన మాటల్లోనే చూద్దాం..

చేనుపై పత్తి పూర్తిగా విచ్చుకుని ఆరిన తరువాత ఏమాత్రం తేమలేని సమయంలో పత్తిని ఏరాలి. తరువాత నీడలో ఒకటి రెండు రోజులు ఆరబెట్టాలి. పూర్తిగా ఎండలో ఆరబెట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశం ఉంటుంది. రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత బస్తాల్లో కానీ విడిగా గదిలో గానీ నిల్వ చేయడం వల్ల ఎలాంటి తేమ పెరుగదు.

చేనుపై పత్తి ఉన్న సమయంలో వర్షాలు కురిస్తే వెంటనే పత్తి తీయకుండా నాలుగు రోజులు చెట్టుమీదనే పూర్తిగా ఆరేలా చూడాలి. ఆ తరువాతే పత్తి తీయాలి.

ఎక్కువ తూకం వస్తుందని నీటిని కలిపి తీసుకురావడం వల్ల అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంటుంది. నీటిని కలుపడం వల్ల రంగు మారి నాణ్యత తగ్గిపోతుంది. ఒకటి రెండు కిలోల తూకం కోసం ఆశపడి మొత్తం పత్తిని నాశనం చేసుకోవద్దు. నాణ్యమైన పత్తిని తీసుకురావడం వల్ల మంచి ధరపొందవచ్చు.

పత్తిని ఉదయం, సాయంత్రం సమయాల్లో కాకుండా కొద్దిగా ఎండ ఉన్న సమయాల్లో తీయాలి. ఎలాంటి పత్తిని తీయాలనే విషయంలో కూలీలకు ముందుగానే సలహాలు ఇవ్వాలి. మంచి పత్తి, గుడ్డి పత్తిని వేరువేరుగా తీసేలా చూడాలి. వేరువేరుగానే మార్కెట్‌కు తీసుకురావాలి.

వివిధ రకాలైన పత్తిని కలుపరాదు. ఎందుకంటే అన్ని రకాల పత్తి గింజలు ఒకేలా ఉండవు. రంగుల్లో తేడాలుంటాయి. చూడగానే వ్యాపారులకు అనుమానం వస్తుంది. అందువల్ల ఏ రకానికి ఆ రకం మార్కెట్‌కు తీసుకువెళ్లాలి.


మల్లేశం, ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

తేమ శాతం ముఖ్యం..

పత్తి ఖరీదు చేసే సమయంలో తేమ శాతాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకుంటారు. 8శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తుంది. పత్తిలో తేమ శాతం తెలుసుకోవడానికి అధికారులు ప్రత్యేక పరికరాన్ని వినియోగిస్తారు. ఈ పరికరం పొడవు 18 అంగుళాలు రెండు కడ్డీలకు ఉన్న తీగల ద్వారా డిజిటల్ మీటర్‌కు అనుసంధానం చేసి ఉంటుంది. రెండు కడ్డీలు పత్తిలో గుచ్చిన సమయంలో డిజిటల్ మీటర్ పత్తిలో తేమ శాతాన్ని అంకెల రూపంలో చూపిస్తుంది.

తేమ విషయంలో కొంత సడలింపు ఇవ్వాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 8 శాతం వరకు ఉంటేనే మద్దతు ధర లభిస్తోంది. దానిని 10 శాతానికి పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా 8 నుంచి 12 వరకు తేమశాతం ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తోంది. అలా కాకుండా 12 నుంచి 18 వరకు తేమశాతం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేయాలని రైతుల పక్షాన కాటన్ అసోసియేషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

పత్తిలో తేమ	మద్దతు ధర
8 శాతం	రూ.8.110లు
9 శాతం	రూ.8.028లు
10 శాతం	రూ.7.947లు
11 శాతం	రూ.7.866లు
12 శాతం	రూ.7.785లు

సీసీఐ నిబంధనలు

- నాణ్యతలేని, రంగుమారిన, వర్షానికి తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు.
- పత్తిని సంచుల్లో కాకుండా ట్రాలీ వాహనాల్లో తీసుకురావాలి.
- పత్తి రైతులందరూ సంబంధిత (ఏపీఎంసీ)లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- పత్తి రైతులకు చెల్లింపు నేరుగా (ఏబీపీఎస్/పీఎఫ్ఎంఎస్) ద్వారా వారి ఆధార్‌కు లింక్ చేయబడిన బ్యాంక్ ఖాతాలోకి మాత్రమే జమ చేస్తుంది.

అందువల్ల పత్తి రైతులు తమ బ్యాంకు ఖాతాను ఆధార్‌కు లింక్ చేసుకోవాలి.


కథా నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సహృదయ ప్రతినిధులు

కాళోజీ కళాక్షేత్రంలో

రాష్ట్రస్థాయి కథానాటిక పోటీలు

జనవరి 1 నుంచి 4 వరకు ప్రదర్శన

వడ్డెపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కందాళం ఫౌండేషన్ (అమెరికా), సహృదయ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్రస్థాయి కథానాటికల పోటీలను నిర్వహించనున్నట్లు సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహర బాబు, సంస్థ ప్రతినిధులు ఆచార్య డీఎస్ఎన్ మూర్తి, ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర స్థాయి కథానాటిక పోటీల కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2026 సంవత్సరం ప్రతిభామూర్తి జీవిత కాల సాధన పురస్కారం డాక్టర్ గుంజి వెంకటరత్నంకు, విశిష్ట సాహితీమూర్తి జీవిత కాల సాధన పురస్కారం వరంగల్‌కు చెందిన ప్రముఖ రచయిత రామా చంద్రమౌళికి, సరిలేరు నీకెవ్వరు విశిష్ట రంగస్థల పురస్కారం కోట్ల హన్మంతరావుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నేత్రపర్వంగా నిర్వహించే 9 నాటికలను ప్రతీ రోజు మూడు చొప్పున కాళోజీ కళాక్షేత్రంలో సాయంత్రం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు: 98662 53646 / 99490 13448 లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సహృదయ సంస్థ ప్రతినిధులు రామకోటేశ్వర్‌రావు, వనం లక్ష్మీకాంతరావు, ఏవీ నర్సింహారావు, కె.కృష్ణమూర్తి, న్యాలకొండ భాస్కర్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, కనుకుంట్ల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జనవరి 24 నుంచి పలు రైళ్లు రద్దు

మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులే కారణం

కాజీపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో మూడో రైల్వే లైన్ నిర్మాణంతో జనవరి 24 నుంచి ఫిబ్రవరి 14 వరకు, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష రూట్లలో వెళ్లే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. (67771) సిర్పూర్ టౌన్ - కరీంనగర్‌ల మధ్య మెము అప్ అండ్ డౌన్ రైలు, (17003) కాజీపేట - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే మెము ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17004) కాజీపేట - బల్లార్ష మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17035) కాజీపేట -బల్లార్ష మధ్య నడిచే సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు రద్దు కానున్నాయి. జనవరి 24 బల్లార్షా మీదుగా ఢిల్లీ వైపు వెళ్ల మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లించి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నాగేంద్రుడికి నెమలి వాహనసేవ

గీసుగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా తయారు చేయించిన నెమలి వాహనంలో ఆసీనులైన సుబ్రహ్మణ్యేశ్వస్వామి, వల్లిదేవి, దేవసేనాదేవి విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి తరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.


నెమలి వాహనంలో ఆసీనులైన ఉత్సవ మూర్తులు

కర్రెగుట్టలను సురక్షిత ప్రాంతంగా చేస్తాం..

» సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్
» మురుమూరులో సీఆర్పీఎఫ్ బేస్ క్యాంప్ ప్రారంభం

వాజేడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కర్రెగుట్టలను పూర్తిగా ఆధీనంలోకి తీసుకునేందుకు వాజేడు మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన మురుమూరులో సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేసి మంగళవారం ఆ క్యాంపును ప్రారంభించారు. సీఆర్పీఎఫ్ దక్షిణ విభాగం ఐజీ ఎస్‌హెచ్ టి.విక్రమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్రెగుట్ట హిల్స్‌తో సీఆర్పీఎఫ్ క్యాంపును ప్రారంభించిన ఐజీ విక్రమ్ మాట్లాడారు. కర్రెగుట్ట అడవులను సురక్షితంగా ప్రదేశంగా ఉంచేందుకు ఈ క్యాంపుల ముఖ్య ఉద్దేశమన్నారు. మురుమూరులో బేస్ క్యాంపు ఏర్పాటుతో పాటు పామునూరులో మరో క్యాంపు ఏర్పాటు చేసి కర్రెగుట్టల వరకు రహదారి నిర్మాణం చేపడతామని ఆయన అన్నారు. కర్రెగుట్టలను అభివృద్ధి చేయడంతో ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఇక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కర్రెగుట్టలను సురక్షితం, శాంతిని నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అటవీ శాఖ, రెవెన్యూ స్థానిక పోలీసుల సహకారంతో త్వరితగతిన ఈ క్యాంపును ఏర్పాటు చేయగలిగామని ఆయన పేర్కొన్నారు.

కాగా, ఈ క్యాంపులో సుమారు 350 మంది సీఆర్పీఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రయివేటు భూమిలో ఐదేళ్ల పాటు లీజుకు తీసుకొని క్యాంపును ఏర్పాటు చేయగా ప్రస్తుతం తాత్కాలిక టెంట్లు, మరుగుదొడ్లను నిర్మించి క్యాంపు అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ క్యాంపును నిర్మించి సీఆర్పీఎఫ్ పూర్తి కార్యకలపాలను చేయనుంది. ఈకార్యక్రమంలో హైదరబాద్ రేంజ్ డీఐజీ అనిల్‌మింజ్, కమాండెంట్ ప్రశాంత్ శ్రీవాత్సవ్, ములుగు ఓఎస్‌డీ శివంఉపాధ్యాయ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, సీఐ రమేష్, ఎస్సైలు సతీష్, తిరుపతిరావులు పాల్గొన్నారు.

'సానుభూతి పరుల ముద్రను తొలగించండి'

సీఆర్పీఎఫ్ క్యాంపు ప్రాంభోత్సవంలో మురుమూరు మాజీ సర్పంచ్ పూసం నరేష్ మాట్లాడారు. తమ పంచాయతీలో కొంత మంది వ్యక్తులను మావోయిస్టు సానుభూతిపరుల ముద్ర వేసి తరచూ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు. ప్రస్తుతం మారిన పరిస్థితుల్లో ఆ ముద్రను తొలగించాలని ఆయన ఈ సందర్భంగా ఐజీ విక్రమ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను కోరారు.


బేస్ క్యాంప్ నమూనాను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ తదితరులు

కేంద్ర బలగాల చేతికి కర్రె గుట్టలు

మురుమూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాల పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుందని తెలుస్తోంది. బేస్ క్యాంప్‌లో సుమారు 350 సీఆర్పీఎఫ్ జవాన్‌లు విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండగా అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్‌ల సాయంతో నిత్యం కర్రెగుట్టలపై నిఘా ఉంచనుంది. కర్రెగుట్టల్లో మిగిలిన మావోయిస్టుల కోసం కేంద్రం వేట కొనసాగిస్తుందని తెలుస్తోంది. కర్రెగుట్టలపైకి రహదారి నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే నిత్యం జనసంచారం ఉండడంతో మావోయిస్టులు కర్రెగుట్టలో తల దాచుకునే పరిస్థితి ఉండదు. దీంతో మావోయిస్టులు లొంగి పోవడమో లేక ఇతర మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. కర్రెగుట్టల చుట్టూ సీఆర్పీఎఫ్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని ఐజీ విక్రమ్ తెలపడంతో కర్రెగుట్టలు మొత్తం సీఆర్పీఎఫ్ బలగాల చేతికి వెళ్లినట్లేనని చెప్పుకోవచ్చు. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను ఆనుకొని ఈ కర్రెగుట్టల ఉండగా, ఈ ఏడాది మార్చి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో కర్రెగుట్టలను కేంద్ర బలగాలు పూర్తిగా ఆధీనంలో తీసుకొని మావోయిస్టుల ఏరివేతను ప్రారంభించాయి. దీంతో మావోయిస్టు పార్టీ కోలుకోలేని స్థితికి వెళ్లడంతో మావోయిస్టు అగ్రనాయకులు లొంగిపోవడంతో పాటు సీసీ సభ్యులు ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. వందల సంఖ్యలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల ముందు ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఇటీవల మావోయిస్టు అగ్రనాయకుడు హిడ్మా సైతం మృతిచెందడంతో మావోయిస్టు ఉద్యమం మరింతగా నీరుగారిందని చర్చలు జరుగుతున్నాయి. తాజా వాజేడులోని మురు మూరులో సీఆర్పీఎఫ్ క్యాంపు ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలపాలకు చెక్ పడనుంది.

ఈసారి ఏకగ్రీవాలు ఏ మేరకు ఉండేనో ?

» అందని రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు
» మొండిచేయి చూపిన గత ప్రభుత్వం
» ఎంపీలు, ఎమ్మెల్యే నుంచి రాని మరో రూ.10 లక్షలు
» నిరాశకు లోనైన గత పంచాయతీ పాలక వర్గాలు

హనుమకొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. మరో 24 గంటల్లో ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కాబోతోంది. దీంతో పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సమరం మొదలు కానుంది. ఈసారి కూడా ఏకగ్రీవమైన పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే నజరానా ప్రకటించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ప్రోత్సాహకంగా రూ. 10 లక్షలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది.

ఇంత వరకు బాగానే ఉంది. ఎన్ని పంచాయతీలు ఏకగ్రీవం అవుతాయనే విషయంలోనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్పందన ఎలా ఉంటుందన్నదే చర్చనీయాంశం అవుతోంది. ఇందుకు కారణం గత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఏకగ్రీవాలు చేసుకుంటే పాలకవర్గాల కాలపరిమితి ముగిసే నాటికి ఎలాంటి నిధులు రాలేదు. ఈ ప్రోత్సాహకాలు అందనందువల్ల ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోయామని మాజీలు అభిప్రాయపడుతున్నారు.

మొర ఆలకించలేదు

గత పంచాయతీ ఎన్నికలు 2019 జనవరి 21,25,30 తేదీల్లో మూడు విడతలుగా జరిగాయి. పాలక వర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు జరగలేదు. పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లాయి. గత అయిదేళ్ల గ్రామ పంచాయతీల అభివృద్ధికి అనుకున్న స్థాయిలో గ్రాంట్లు విడుదల కాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కొన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచులు అప్పులు తెచ్చి పనులు చేశారు. పాలక వర్గాలు స్థానిక నేతలు, ఎమ్మెల్యే ద్వారా తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కనీసం ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రోత్సాహకాలన్నా ఇప్పించాలని ప్రాధేయపడినా ఫలితం దక్కలేదు.

ప్రశాంతంగా ఎన్నికలకు...

పంచాయతీ ఎన్నికలు ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా, వివాదాలక తీతంగా ప్రశాంతంగా జరిగేందుకు, ప్రజలు ఐక్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవాలను ప్రోత్సాహకంగా ఈ నజరానాను ప్రకటించింది. గత ప్రభుత్వం కూడా ఇలాగే ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహకాలను ఇస్తానని వాగ్దానం చేసింది. సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా చేసుకున్న ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షలు ఇస్తానంది. పైగా నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆయా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 10 లక్షల ప్రోత్సాహక నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. వెరసి రూ. 20 లక్షల నిధులులొస్తాయి. గ్రామాన్ని ఎంతకొంత అభివృద్ధి చేసుకోవచ్చునని ప్రజలు ఆశపడ్డారు. దీనితో వీరంతా ఏకమై పార్టీలను పక్కన పెట్టి ఏకగ్రీవాలకు కలిసికట్టుగా కదిలారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీల్లో 284 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. ఇందుకు సంబంధించి రూ. 56 కోట్లు రావాల్సి ఉంది. కానీ పాలక వర్గాల పదవీకాలం ముగిసినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. అటు ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం తాము ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏకగ్రీవంగా గెలిచినవారు వాపోయారు.



వివరాలు తీసుకున్నా..

గత ప్రభుత్వం ఏకగ్రీవ ప్రోత్సాహకాలు ఇస్తానని జిల్లా పంచాయతీ అధికారుల నుంచి వివరాలను తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాల వివరాలను పంపించారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. గతంలో పంచాయతీ పాలకవర్గాల సమావేశాల్లో కూడా సర్పంచ్‌లు ప్రోత్సాహకం విషయమై పలుమార్లు లేవనెత్తారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలు ప్రోత్సాహక నిధులు వస్తాయనే ఆశతో పాలకవర్గాలు అత్యవసర పనులకు తీర్మానం చేసికొని పనులను పూర్తి చేసి ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసం నిరీక్షించారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు ప్రభుత్వం డబ్బులు ఇస్తే తీసుకుంటామనే భావనతో పనులు పూర్తి చేయగా మరికొందరు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కొన్ని చోట్ల అసలు ఆ డబ్బులు రాకపోవడంతో ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో గ్రామస్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవాలకు రూ. 10 లక్షలు ఇస్తానని ప్రకటిస్తున్నందునా ఈసారి అవైనా వస్తాయా ? అన్న సందేహాన్ని గ్రామీణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

చదువు కొంచెం.. పనులు ఘనం



ఎలక్ట్రికల్ కారుగా మార్చిన పాత కారు వద్ద మహిపాల్‌చారి

- మినీ కల్టివేటర్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ
- పలు అవార్డులకు సీతారాంపురం వాసి ఎంపిక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిపాల్‌చారి

పరకాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తుంది నేటి యువత. పుట్టింది పల్లెటూరు, పెద్దగా చదువుకోకపోయినా ఢిల్లీ వరకు వెళ్లి రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు మహిపాల్‌చారి. హనుమకొండ జిల్లా పరకాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కె.మహిపాల్‌చారి పదో తరగతి ఫెయిల్ అయి తల్లిదండ్రులు మందలిస్తే హనుమకొండకు వెళ్లి అలంకార్ థియేటర్ సమీపంలో ఓ మెకానిక్ వద్ద చేరాడు. మెకానిజంలో నైపుణ్యంతో అనతికాలంలోనే గడ్డిని తొలగించేందుకు మినీ కల్టివేటర్‌ను తయారు చేశాడు. అది తమకు కావాలంటూ రైతుల నుంచి ఆర్డర్లు వచ్చాయి. పది మందిని ఏర్పాటు చేసుకొని అధిక సంఖ్యలో కల్టివేటర్లు తయారు చేసి రైతులకు అందించేవాడు.

2015లో రాష్ట్రపతి అవార్డు

మహిపాల్‌చారి తయారు చేసిన మినీ కల్టివేటర్ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డును అందుకున్నాడు. అప్పటి నుంచి ప్రతియేటా 500లకు పైగా మినీ కల్టివేటర్లు తయారు చేస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన రైతులకు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాడు. ఇదే కాకుండా నేషనల్ ప్రీమియర్ ఎంటర్‌షిప్ అవార్డు కూడా కేంద్ర ప్రభుత్వం 2016లో అందించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్రామీణ సృజన శక్తి వెలుగుదారుల వేదికపై ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహిపాల్‌చారికి సంబంధించిన సృతజనాత్మకతో ప్రతిబింబించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాత వాటిని ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారీ

ఇటీవల ప్రజలు ఎక్కువగా ఎలక్ట్రికల్ వాహనాలపై మక్కువ చూపడంతో బోర్‌కు వచ్చిన వాహనాలతో పాటు మూలన పడ్డ వాహనాలకు ఎలక్ట్రికల్ వాహనాలుగా మార్చుతున్నాడు. నాలుగు గంటలు చార్జింగ్ చేస్తే 60 నుంచి 100 కిలోమీటర్ల వరకు వెళ్లే బైక్‌ను తయారు చేశాడు. ఇందుకు రూ. 35 వేలు ఖర్చవుతుందని, ఎవరికైనా కావాలంటే పాత వాహనాలను ఎలక్ట్రికల్ వాహనాలుగా తయారు చేసి ఇస్తానని మహిపాల్‌చారి పేర్కొన్నారు. అలాగే కారుకు 4 గంటల చార్జింగ్‌తో 70 నుంచి 250 కి.మీ. వరకు ప్రయాణించేలా రూ. 1 లక్షా 50 వేల ఖర్చుతో అందజేస్తున్నారు. గ్రామీణ యువకుడు ఇలా ప్రజలకు అవసరమయ్యే వస్తువులను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



అవార్డు అందుకుంటున్న మహిపాల్‌చారి



ఏజెన్సీలో మంచు దుప్పటి



ఇబ్బందులు పడిన వాహనదారులు

ఏజెన్సీ కొత్తగూడ మండలంలో మంగళవారం ఉదయం మంచు దుప్పటి కప్పింది. మంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో మంచు కప్పడంతో ప్రజలు ఆహ్లాదానికి గురయ్యారు.

- కొత్తగూడ (ఆంధ్రజ్యోతి)

అమృత్ పనుల్లో వేగం పెంచాలి

● ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మునిసిపాలిటీలో జరుగుతున్న అమృత్ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని రీజినల్ డైరెక్టర్ ఫర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(ఆర్‌డీఎంఏ) వరంగల్ షాహిద్ మసూద్ అన్నారు. మంగళవారం డోర్నకల్ మునిసిపాలిటీలో అమృత్ పథకం కింద చేపట్టిన పైపులైన్, మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగంగా జరిగి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మునిసిపల్ కమిషనర్ నిరంజన్, ప్రజా ఆరోగ్య శాఖ ఏఈ శృతిలను ఆదేశించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే నోటీసులు ఇవ్వాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, మంద శంకర్, హెచ్.లింగన్న, మదార్ అన్నారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కాకముందు 44 కార్మిక చట్టాలుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని విమర్శించారు. ఆ లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. పెట్టుబడిదారులకు మేలు చేసే విధంగా కేంద్ర పాలకుల తీరు ఉందని ఆరోపించారు. గార కోటేష్, శ్రావణ్, జానీ, బిచ్చా, రాము, జబ్బార్, బాలమల్లు పాల్గొన్నారు.

ఎస్పీ శబరీష్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు



ఎస్పీ శబరీష్‌కు మొక్క అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ శబరీష్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఇటీవల నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శబరీష్‌ను కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్, సుధగాని మురళీ, లూనావత్ అశోక్ నాయక్, ఆవులవెంకన్న, నర్సింగం వెంకన్న, కత్తుల ఎలేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మార్నేని రఘు, జెరిపోతుల వెంకన్న, కర్పూరపు గోపి, దౌలాగర్ శంకర్, అంబాల శివ, ఎస్కే.ఖలీల్ పాల్గొన్నారు.

పెన్షన్ మంజూరిలో అక్రమాలు లేకుండా చూడాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ మంజూరిలో అక్రమాలకు తావివ్వకుండా చూడాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(రెవా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా భద్రినారాయణ, గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని జిల్లా ట్రెజరరీ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణకు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024లో పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు 20 నెలల నుంచి ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాలేదని పేర్కొన్నారు. పెన్షన్ మంజూరి విషయంలో కార్యాలయ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోవర్దన్, మురళీధరస్వామి, వెంకన్న, రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్

● ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులపాలు చేసి దివాళా తీయించిందని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్ నాయక్ అన్నారు. మంగళవారం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బిషప్ అజరయ్య ఫంక్షన్ హాల్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. ఈసందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ... సమైక్య రాష్ట్రంలో నీళ్లు, నిధులు, ఉద్యోగాలు దోపిడీకి గురవుతున్నాయని భావించిన తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారని అన్నారు. సమైక్య రాష్ట్రంలో 70 ఏళ్లలో అప్పటి పాలకులు రూ.70వేల కోట్లు అప్పులు తీసుకువచ్చి రోడ్లు, ప్రాజెక్టులు, పాఠశాల భవనాలు, బ్రిడ్జిలు, ఆస్పత్రులు నిర్మించారని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.10లక్షల కోట్లు అప్పు చేసినా అభివృద్ధి ఏమి లేదన్నారు. అక్రమ ఆస్తులు కూడబెట్టి వాటి పంపకాల్లో వచ్చిన తేడాతో కుటుంబసభ్యుల మధ్య విభేదాలు వచ్చాయని అన్నారు. అనంతరం డోర్నకల్, చిలుక్కొయ్యల పాడులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి వరప్రసాద్, సెర్ప్‌ఏపీఎం పాపయ్య, సీసీలు సౌందర్య, రాధ, ఐలయ్య, రమేష్ పాల్గొన్నారు.



డోర్నకల్‌లో చీరలు పంపిణీ చేస్తున్న విప్ రాంచందర్‌నాయక్

అంబేద్కర్ వల్లే బలహీన వర్గాలకు న్యాయం

● కురవి(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. సీరోలు మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో పేద వర్గాలకు రాజకీయంగా, ఉద్యోగాల్లో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాకవి జయరాజు, భైరి నరేష్, డీఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు డాక్టర్ వివేక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు అంబటి వీరభద్రం, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

(5వ పేజీ తరువాయి)

దోహదపడుతుందన్నారు. జిల్లా సైన్స్ అధికారి అప్పారావు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలోని పాఠశాలల నుంచి 220 ఎగ్జిబిట్లు, ఇన్‌స్పైర్‌కు 86 ఎగ్జిబిట్లు మొత్తం 306 ఎగ్జిబిట్లు ప్రదర్శించారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సైన్స్ ఫెయిర్ ప్రారంభంలో విద్యార్థినుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిట్లను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, డీఈవో దక్షిణామూర్తి సందర్శించి వాటి ప్రాముఖ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొలుత డీఈవో దక్షిణామూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు మందుల శ్రీరాములు, విజయకుమారి, సంతోష్‌కుమార్, శంకర్, బాలాజీ, ఎంఈవోలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మిర్యాల సతీష్‌రెడ్డి, ఎస్కె యాకూబ్, బలాష్టి రమేష్, నిర్వహణ కమిటీల బాధ్యులు కాలేరు యాదగిరి, కల్లెం వెంకట్‌రెడ్డి, రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ఆగుర్తి సురేష్, రాందాస్, మాధవాచారి, ఓంప్రకాష్, సదయ్య, రవికుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

కార్యకర్తల కుటుంబాలను కాపాడుకుంటాం

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటూ కాపాడుకుంటామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ అన్నారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన వస్రం వీరన్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబానికి మంగళవారం పరామర్శించారు. అలాగే రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదేశాల మేరకు వీరన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఆపదలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొల్లి సారయ్య, బత్తుల రామన్న, భూపతి శ్రీను, జున్నూరి వెంకన్న, డోనికెన కుమారస్వామి, కారింగుల శ్రీను, కరుణాకర్, బాదావత్ శ్రీను, దారావత్ దేవేందర్, భిక్షం, గుర్రం ప్రభాకర్, డొనికెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

● టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని పోస్టాఫీస్ కార్యాలయం వద్ద ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ప్రధానమంత్రికి పోస్టు ద్వారా వినతి పత్రాలను పంపించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా తీర్పుపై సమీక్ష కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పిస్తామనే భరోసా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్సీటీఈ నోటిఫికేషన్ ప్రకారమే 2010 ఆగస్టు 23కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని పేర్కొన్నందున గత కొన్నేళ్లుగా టెట్ రాయాలనే ఆలోచన చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, మంజుల, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, బాబు, సోమేశ్వర్, వీరభద్రం, జ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ పోస్టాఫీస్ వద్ద ప్రధానమంత్రికి పోస్టు ద్వారా వినతి పత్రాలు పంపుతున్న టీఎస్-యూటీఎఫ్ నాయకులు

గాంధీనగర్‌లో కొండచిలువ కలకలం

కొత్తగూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొండచిలువ కలకలం సృష్టించింది. గాంధీనగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీసీసీ కొనుగోలు కేంద్రం పక్కన దారిలో కొండచిలువ సంచరిస్తుండటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ఇనుగుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలుతండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మహబూబాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో 23 మంది విద్యార్థులకు రూ.11,500 విలువైన బ్యాగులను అందజేశారు సంస్థ ప్రతినిధులు మీసాల నాగేంద్రబాబు, గోవిందచారి, బండి కోటేశ్వర్, వినయ్, హెచ్‌ఎం బొరిగం రాములు, జి.వేణు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతోనే లక్ష్యం నెరవేరుతుంది..

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సరైన ప్రణాళికతో అభ్యసించినప్పుడే విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకుంటారని ఇండియా లిట్రసీ ప్రాజెక్టు బాధ్యులు కె.కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని కల్వల మోడల్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు నరేందర్, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఇనుగుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అజ్మీరా యాకేష్ పెద్దపల్లి జిల్లాలో ఈనెల 26 నుంచి 28 వరకు నిర్వహించే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రూపారాణి, పీడీ తాళ్ల ప్రణయ్ మంగళవారం తెలిపారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో యాకేష్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

మేడారంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పూజలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని మేడారంలో సమ్మక్క, సారలమ్మ దేవతల గద్దెల వద్ద మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ప్రత్యేక పూజలు చేశారు. తమకు సంస్థ నుంచి రావాల్సిన రిటైర్‌మెంట్ బకాయిలను ఇప్పించాలని వేడుకున్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులంతా మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ యాత్ర ప్యాకేజీ బస్సులో మేడారంకు వెళారు. సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 40ఏళ్ల పాటు సర్వీసులో ఉండి ప్రయాణికులకు సేవలందించిన తామంతా ఆరోగ్యంగా ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి పట్టాభి లక్ష్మయ్య, జిల్లా ప్రతినిధి గూడెల్లి భిక్షపతి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల సుధాకర్, బీరవెల్లి రవీందర్‌రెడ్డి, ఎమ్డీ. రంజాన్, సురేంద్రచారి, వెంకన్న, కృష్ణయ్య, హరికుమార్, నర్సింగరావు, అజీముద్దీన్, సాధిక్, గురుమూర్తి, పుల్లారెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

మోగిన 'పంచాయతీ' నగారా

(5వ పేజీ తరువాయి)

సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 5,56,780 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 2,83,064 మంది మహిళలు, 2,73,692 మంది పురుషులు, 24 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈనెల 27న తొలి విడత, 30న రెండో విడత, డిసెంబరు 3న మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆరంభం కానుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో షెడ్యూల్ విడుదల నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ప్రకటించారు. జిల్లాలో మొత్తం 18 మండలాలు ఉండగా, తొలి విడతలో ఐదు మండలాలు, మలి విడతలో ఏడు మండలాలు, తుది విడతలో ఆరు మండలాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

మూడు విడతల్లో నామినేషన్లు..

మొదటి విడత డిసెంబరు 11న జరుగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27 నుంచి 29 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 30వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు నామినేషన్లను పరిశీలన చేస్తారు. ఆతర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ డిసెంబరు 1వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆయా అభ్యంతరాల పరిష్కారం 2వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు చేస్తారు. ఎవరైనా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి వస్తే 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుంది. ఆపై పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు. డిసెంబరు 11న ఎన్నికల నిర్వహణ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగిస్తారు. ఆపై 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఆ వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. తదుపరి అదే రోజు ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు.

రెండో విడత డిసెంబరు 14న జరుగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నవంబరు 30 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 3వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు నామినేషన్లను పరిశీలన చేస్తారు. ఆ తర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ డిసెంబరు 4వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆయా అభ్యంతరాల పరిష్కారం 5వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు చేస్తారు. ఎవరైనా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సివస్తే 6వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుంది. ఆపై పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు. 14న ఎన్నికల నిర్వహణ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగిస్తారు. ఆపై 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఆ వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఆ తదుపరి ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు.

మూడవ విడత డిసెంబరు 17న జరుగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 6వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు నామినేషన్లను పరిశీలన చేస్తారు. ఆ తర్వాత చెల్లుబాటు అయిన నామినేషన్ల జాబితాను ప్రకటిస్తారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణ డిసెంబరు 7వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఆయా అభ్యంతరాల పరిష్కారం 8వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు చేస్తారు. ఎవరైనా అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవాల్సి వస్తే 9వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంటుంది. ఆపై పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రచురిస్తారు.

17న ఎన్నికల నిర్వహణ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కొనసాగిస్తారు. ఆపై 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. ఆ వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. తదుపరి అదే రోజు ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు.

మూడు విడతల్లో జరిగే మండలాల పంచాయతీలు..

● మహబూబాబాద్ జిల్లాలో తొలి విడత గూడూరు మండలంలోని 41 గ్రామ పంచాయతీలు, 354 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇదే విడతలో ఇనుగుర్తి మండలంలోని 13 పంచాయతీలు, 112 వార్డులు, కేసముద్రం మండలంలోని 29 పంచాయతీలు, 254 వార్డులు, మహబూబాబాద్ మండలంలోని 41 పంచాయతీలు, 338 వార్డులు, నెల్లికుదురు మండలంలోని 31 పంచాయతీలు, 280 వార్డులు వెరసి ఈ ఐదు మండలాలకు సంబంధించి 155 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 1338 వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయి.

● రెండో విడతలో బయ్యారం మండలంలోని 29 గ్రామ పంచాయతీలు.. 252 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. చిన్నగూడూరు మండలంలోని 11 పంచాయతీలు, 96 వార్డులు, దంతాలపల్లి మండలంలోని 18 పంచాయతీలు, 166 వార్డులు, గార్ల మండలంలోని 20 పంచాయతీలు, 184 వార్డులు, నర్సింహులపేట మండలంలోని 23 పంచాయతీలు, 194 వార్డులు, పెద్దవంగర మండలంలోని 26 పంచాయతీలు, 192 వార్డులు, తొర్రూరు మండలంలోని 31 పంచాయతీలు, 276 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. వెరసి ఈ విడతలో మొత్తం 158 గ్రామ సర్పంచులతో పాటు 1360 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి.

● మూడో విడతలో డోర్నకల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు 218 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. గంగారం మండలంలోని 12 పంచాయతీలు, 100 వార్డులు, కొత్తగూడ మండలంలోని 24 పంచాయతీలు, 202 వార్డులు, కురవి మండలంలోని 41 పంచాయతీలు. 344 వార్డులు, మరిపెడ మండలంలోని 48 పంచాయతీలు, 396 వార్డులు, సీరోలు మండలంలోని 18 పంచాయతీలు, 152 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. వెరసి మూడో విడతలో 169 సర్పంచ్‌లతో పాటు 1412 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి.

ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించాలి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ తెలిపారు. కురవి, అయ్యగారిపల్లి, సీరోలు మండలంలోని రేకులతండా, కాంపెల్లి, చిలుక్కోయలపాడు, మన్నెగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్రం, కరుణాకర్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, తహసీల్దార్లు విజయ, పున్నం చందర్, ఎంపీడీవోలు వీరబాబు, గౌస్, కాంగ్రెస్ నాయకులు బండి వెంకట్‌రెడ్డి, బండి లక్ష్మారెడ్డి, అవిరె మోహన్‌రావు, గొల్లపల్లి రజినీకాంత్, ఎన్.రాజేందర్‌కుమార్, బి.రాము నాయక్, తుకారాం నాయక్, లక్ష్మణ్, దైద భద్రయ్య, బెడద వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థినులను పట్టించుకోని అధికారులు

● తాను వస్తున్నానని తెలిసి మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు..

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ అసహనం

కేసముద్రం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు వారం రో జులుగా మీడియాలో వస్తున్నప్పటికీ ఇక్కడి జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అసహనం వ్యక్తం చేశారు. ఈ హాస్టల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. భోజనం నాణ్యత లేదని, గదులు, పరిసరాలు శుభ్రంగా లేవని, పలు సమస్యలను విద్యార్థినులు చెప్పినట్లు తెలిపారు. ఇక్కడి స్పెషల్ ఆఫీసర్, జీసీడీవోలు వారిని పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాను వస్తున్నానని తెలిసినప్పటికీ మొబైల్ స్విచ్ఛాఫ్ చేసుకొని ఉండడం పట్ల ఆయన తీవ్ర అ సహనం వ్యక్తం చేశారు. ఎస్‌వో విధి నిర్వహణ సక్రమంగాలేదని గతంలోనే తాను చెప్పానని, అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఎస్‌వో, జీసీడీవోను వెంటనే సస్పెండ్ చేసి స్టాఫ్‌ను పూర్తిగా మార్చాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెం కటేశ్వర్లు, పొదిల నర్సింహారెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, ఉప్పునూతల రమేష్, నాగరబోయిన చంద్రకళ ఉన్నారు. కాగా, హాస్టల్ నిర్వాహకులను తొలగించి, ఎస్‌వో, జీసీడీవోలను సస్పెండ్ చేయాలని కోరుతూ డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ వినతిపత్రాన్ని హుస్సేన్‌నాయక్‌కు అందజేశారు.

గుర్తుతెలియని యాచకుడి మృతి

డోర్నకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఓ యాచకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డోర్నకల్ రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కార్యాలయం వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఆధారాలు ఏమైనా ఉన్నాయా..అని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో చనిపోయిన వ్యక్తి యాచకుడై ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ బడులను కనుమరుగు కానివ్వొద్దు



లక్ష్మీపురం తండా పాఠశాల విద్యార్థులకు టీషర్టులు అందిస్తున్న శ్రీనివాస్

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను కనుమరుగు కానివ్వొద్దని విద్యావేత్త దారావత్ శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో టీషర్టులను అందించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాటిమీదితండా పాఠశాలకు ఆరు సంవత్సరాల క్రితం టీషర్టుల పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. నాటి నుంచి నేటి వరకు జిల్లా నలుమూలల పాఠశాలల్లో విద్యార్థులకు టీషర్టులు, టై, బెల్టులు, బ్యాగులు, షూస్, పుస్తకాలు అందించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం తమవంతు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షాహీన్, ఉపాధ్యాయులునిఖిల్, ఉమామహేశ్వరి, నరేష్, యశ్వంత్, గ్రామస్థులు నవీన్, రమేష్, జగపతి, అనిల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీరోలు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

కురవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ శబరీష్ మంగళవారం సీరోలు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ తదుపరి పెండింగ్ కేసులను గురించి అడిగి తెలుసుకున్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ పనితీరును తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై గంద్ర సంతోష్ ఉన్నారు.

1న ముసలమ్మ జాతరలో వేలంపాటలు

కొత్తగూడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజేడు ముసలమ్మ జాతరలో డిసెంబరు 1న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో శేషగిరి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, ఫొటోలు అమ్ముకునే హక్కు, శీతలపానీయాలు, కిరాణ సామాను అమ్ముకునే హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 28 నుంచి 29న సాయంత్రం 4గంటల వరకు ముసలమ్మ జాతర దేవాదాయశాఖ కార్యాలయంలో టెండర్ ఫారంలు పొందాలని సూచించారు. కొబ్బరికాయల విక్రయాలకు రూ.2లక్షలు, కిరాణ సామాను విక్రయాలకు రూ.50వేలు ముసలమ్మ జాతర పేరు మీద డీడీ రూపంలో తీసుకుని వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

మానుకోటలోనే రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాకు రూ.903 కోట్లతో మంజూరైన రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఇక్కడే ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మానుకోట జిల్లాకు మంజూరైన రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోను వేరే ప్రాంతాలకు తరలించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే స్థలం కేటాయించి ప్రాజెక్టుకు సంబంధించి పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ ప్రాంతంలో ఉన్న అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని చెప్పారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా చొరవ చూపి పరిశ్రమ తరలిపోకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపోను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, పాండురంగాచారి, సందీప్, శ్రావణ్, ఫాతిమా, రమేష్, అశోక్, వీరన్న, లింగ్యా, ఎమ్డీ.మహమూద్, చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, నాగార్జున, శ్యాంప్రసాద్, పద్మ, పాల్, జానీ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు